విద్యార్థుల ప్రయోగాలు భళా..

- సైన్స్ ఫెయిర్‌లో ప్రతిభ
- జిల్లా స్థాయికి మూడు పాఠశాలల ఎంపిక

పొదలకూరు: మండల స్థాయిలో జరిగిన సైన్స్ ఫెయిర్‌లో ఇనుకుర్తి, మహ్మదాపురం, మరుపూరు జెడ్పీ హైస్కూల్స్ విద్యార్థులు, టీచర్ ప్రతిభ చూపారు. వీరు ఈనెల 3వ తేదీన నెల్లూరులో జిల్లా స్థాయిలో జరిగే ప్రదర్శనలో నమూనాలను ప్రదర్శించనున్నారు.

వేస్ట్ వాటర్ ఫిల్టరేషన్

ఇనుకుర్తి జెడ్పీ హైస్కూల్లో 8వ తరగతి చదువుతున్న ఎం.పవిత్ర గతనెల 30వ తేదీన నిర్వహించిన సైన్స్ ఫెయిర్‌లో వేస్ట్ వాటర్ ఫిల్టరేషన్ నమూనాను ప్రదర్శించింది. ఈమెకు గైడ్ టీచర్‌గా సైన్స్ టీచర్ రాపూరు బాబూరావు వ్యవహరించారు. సాధారణంగా బావి లేదా నదిలో నీటిని తీసుకుని ఆరు అంచెల విధానంలో శుద్ధి చేస్తుంటాం. అందులో తాగునీటిని రూపొందించే విధానాన్ని పవిత్ర ప్రదర్శించి మండల స్థాయిలో ప్రతిభ చూపి జిల్లా స్థాయికి ఎంపికైంది. హెచ్ఎం సలూజరాణి పవిత్రకు అన్ని విధాలుగా ప్రోత్సాహం అందించారు.


వేస్ట్ వాటర్ ఫిల్టరేషన్ గురించి వివరిస్తున్న విద్యార్థినులు


స్మార్ట్ అగ్రికల్చర్ ఇరిగేషన్ సిస్టంను వెల్లడిస్తున్న హైందవి, హిరణ్యశ్రీ

స్మార్ట్ అగ్రికల్చర్ ఇరిగేషన్ సిస్టం

మహ్మదాపురం డీఎస్సార్ జెడ్పీ హైస్కూల్లో 9వ తరగతి చదువుతున్న జేఎల్ హైందవి, ఎ.హిరణ్యశ్రీలు గ్రూపు ప్రదర్శనలో భాగంగా స్మార్ట్ అగ్రికల్చర్ ఇరిగేషన్ సిస్టంను సైన్స్ ఫెయిర్‌లో పెట్టారు. భూమిలోని తేమ ఆధారంగా ఈ నమూనా పనిచేస్తుందని వివరించారు. వీరికి గైడ్‌గా సైన్స్ టీచర్ ఎం.సుబ్బానాయుడు వ్యవహరించారు. ఈ ప్రాజెక్ట్ వల్ల పంటలు ఎండిపోకుండా అధిక నీరు వృథా కాకుండా కాపాడుకోవచ్చని విద్యార్థినులు వెల్లడించారు. హెచ్ఎం సీహెచ్ రామకృష్ణయ్య వారిని అభినందించారు.

ఎడ్యుకేషన్ ఈక్విటేషన్

మరుపూరు జెడ్పీ హైస్కూల్లో టీచర్‌గా పనిచేస్తున్న నాగశిరీషా ఎడ్యుకేషన్ ఈక్విటేషన్‌పై టీచర్ల ప్రదర్శన విభాగంలో ప్రతిభ చూపారు. విద్యారంగంలో సమానత్వం అనే అంశంపై ఆమె ప్రజెంటేషన్ ఇచ్చి ఆకట్టుకున్నారు. హెచ్ఎం మురళీ ప్రోత్సహించారు.

క్లుప్తంగా

బుచ్చిలో నేటి నుంచి విద్యుత్ కోతలు

బుచ్చిరెడ్డిపాళెం: మండల పరిధిలో మూడు రోజుల పాటు విద్యుత్ కోతలు ఉంటాయని విద్యుత్ శాఖ ఏడీఈ సతీష్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2, 3, 4వ తేదీల్లో ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలియజేశారు. వ్యవసాయ వినియోగదారులకు త్రీఫేస్ సప్లై రాత్రి 12 నుంచి ఉదయం 8 గంటల వరకు ఉంటుందన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

చేజర్ల: మండలంలోని దొరువుపాడు వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళకు స్వల్పగాయాలయ్యాయి. సంగం నుంచి పెంచలకోనకు వెళ్తున్న మినీ ట్రక్కు వ్యాన్, ఆదూరుపల్లి నుంచి వావిలేరుకు పోతున్న ట్రాక్టర్ దొరువుపాడు వద్ద ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో మినీ ట్రక్కు వ్యాన్‌లోని మహిళకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రురాలిని 108 వాహనంలో ఆస్పత్రికి తరలించారు. కాగా ఈ విషయమై తమకు ఎలాంటి సమాచారం అందలేదని పోలీసులు తెలిపారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ



నెల్లూరు(అర్బన్): రోడ్లు, రహదారుల శాఖ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర టేబుల్ క్యాలెండర్‌ను బుధవారం నగరంలోని ఆర్‌అండ్‌బీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఆ శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ గంగాధర్ ఆవిష్కరించి మాట్లాడారు. కొత్త సంవత్సరంలో ఉద్యోగులు ప్రజలకు మంచి సేవలందించాలని కోరారు. కార్యక్రమంలో ఆ శాఖ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మస్తానయ్య, అసోసియేట్ ప్రెసిడెంట్ మధు, పలువురు సభ్యులు పాల్గొన్నారు.

డీఏఓకు సన్మానం



నెల్లూరు(సెంట్రల్): జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి సత్యవాణిని ఆమె కార్యాలయంలో అఖిల భారత పద్మశాలి సంఘం జిల్లా ప్రతినిధులు బుధవారం కలిసి సన్మానించారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. సంఘ జిల్లా గౌరవాధ్యక్షుడు అశ్వద్దామ, జిల్లా అధ్యక్షుడు బుధవరపు బాలాజీ, అవ్వరు రామచంద్రయ్య, సోమా గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

10న వైకుంఠ ఏకాదశి


కరపత్రాల ఆవిష్కరణ

బుచ్చిరెడ్డిపాళెం: బుచ్చిరెడ్డిపాళెంలోని కోదండరామస్వామి ఆలయంలో ఈనెల 10వ తేదీన వైకుంఠ ఏకాదశి సందర్భంగా విశేష పూజలు, అభిషేకాలు జరుగుతాయని ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త దొడ్ల మురళీ కృష్ణారెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం ఆలయంలో మాట్లాడారు. 10న శుక్రవారం భక్తులకు ద్వార దర్శనం, విశేషాలంకారాలు, పూజలు ఉంటాయని వివరించారు. అనంతరం కరపత్రాన్ని విడుదల చేశారు.

వెంకటేశ్వరాలయంలో ధనుర్మాస పూజలు

పొదలకూరు: పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్లో శ్రీలక్ష్మి గోదా సమేత వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో బుధవారం తెల్లవారు జామున ధనుర్మాస పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేశారు.

తాటిపర్తిలో ఫీవర్ సర్వే

పొదలకూరు: మండలంలోని తాటిపర్తి గ్రామంలో మహ్మదాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి నరసింహారావు పర్యవేక్షణలో బుధవారం ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి జ్వరాలపై సర్వే నిర్వహించారు. మొత్తం ఆరు బృందాలుగా ఏర్పడి సర్వే జరిపారు. దోమల లార్వాను పరిశీలించి గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. నీటి నిల్వలపై అబేట్ ద్రావణం పిచికారీ చేశారు. సీజనల్ వ్యాధులపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి ఆంజనేయవర్మ, ఎంపీహెచ్ఈఓ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.


లార్వాను పరిశీలిస్తున్న అధికారులు, సిబ్బంది

సహకార సంస్థలతో మెరుగైన సమాజం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): సహకార సంస్థల ద్వారా మెరుగైన సమాజాన్ని నిర్మిద్దామని డీసీఓ గుర్రప్ప అన్నారు. నగరంలోని రామ్మూర్తినగర్‌లో ఉన్న గుండ్లపాళెం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో సహకార సదస్సును బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీఓ మాట్లాడుతూ ఐక్యరాజ్య సమితి 2025ను అంతర్జాతీయ సహకార సంవత్సరంగా ప్రకటించినట్లు వివరించారు. ఐక్యరాజ్య సమితి ఏర్పాటైనప్పటి నుంచి రెండు సార్లు (2012, 2025) మాత్రమే అంతర్జాతీయ సహకార సంవత్సరాలుగా ప్రకటించినట్లు వివరించారు. పేదరిక నిర్మూలన, ఆర్థిక సామాజిక సాధికారత, పర్యావరణ పరిరక్షణ, ఉద్యోగాల కల్పన లక్ష్యాలను సాధించేలా 2030 విజన్ డాక్యుమెంటేషన్ రూపొందించినట్లు తెలియజేశారు. 'సహకారం ద్వారా సమృద్ధి' అనే నినాదంతో పీఏసీఎస్ సంఘాలు, డెయిరీ సంఘాలు, మత్స్యకార సహకార సంఘాల బలోపేతానికి వేగవంతంగా చర్యలు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో నెల్లూరు డివిజనల్ సహకార శాఖాధికారి సుధాభారతి, జిల్లా సహకార ఆడిట్ అధికారి తిరుపతయ్య, మునిప్రసాద్, గుండ్లపాళెం పీఏసీఎస్ సీఈఓ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీసీఓ గుర్రప్ప

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా..

- కసుమూరులో దారుణ పరిస్థితులు
- అద్దె గృహాల్లో అడ్డగోలు పనులు
- పట్టించుకోని పోలీసులు

వెంకటాచలం: దక్షిణ భారతదేశంలో ఎంతో ప్రసిద్ధి చెందిన మస్తాన్‌వలీ దర్గా మండలంలోని కసుమూరులో ఉంది. ఇక్కడికి వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు వస్తుంటారు. కాగా ఈ గ్రామంలోని కొన్ని అద్దె గృహాల్లో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు విమర్శలున్నాయి. పలువురు నిర్వాహకుల అత్యాస కారణంగా ఆధ్యాత్మిక కేంద్రం ప్రతిష్ట మసకబారుతోంది. దర్గాకు చుట్టుపక్కల కొన్ని కుటుంబాలు ఏళ్ల తరబడి 400కుపైగా అద్దె గృహాలు నిర్వహిస్తున్నాయి. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు వాటిల్లో ఉంటూ దర్గాకు వెళ్తుంటారు. అయితే కొందరు నిర్వాహకులు అత్యాసకుపోయి అద్దె గృహాల్లో అసాంఘిక కార్యకలాపాలను ప్రోత్సహిస్తున్నారు. సాధారణంగా భక్తులు రోజుకు అద్దె గృహాన్ని బట్టి రూ.500 నుంచి రూ.1,500 వరకు చెల్లిస్తారు.

పట్టించుకుంటే కదా..

కసుమూరులోని కొన్ని అద్దె గృహాలు వ్యభిచార కేంద్రాలుగా మారాయని ప్రచారం చాలాకాలంగా ఉంది. ఒక్కో జంట నుంచి గంటకు రూ.2 వేల నుంచి రూ.5 వేల వరకు వసూలు చేస్తున్నట్లు చెబుతున్నారు. భక్తులు ఫోన్లు చేసి సమాచారం అందించినా పోలీసులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. నామమాత్రంగా దాడులు చేసి కేసులు నమోదు చేస్తున్నారు. ఇటీవల రెండు అద్దె గృహాల్లో తరచూ వ్యభిచారం జరుగుతోందని స్థానికులు పోలీసుల దృష్టికి తీసుకెళ్లగా దాడులు చేసి నిర్వాహకులు, జంటలపై కేసులు నమోదు చేశారు. అద్దె గృహాలకు ఎవరు వస్తున్నారు?, ఎక్కడి నుంచి వస్తున్నారు? ఇతర సమాచారం కూడా నిర్వాహకుల వద్ద ఉండటం లేదు. నిబంధనల ప్రకారం ఆధార్ కార్డు, ఫోన్ నంబర్లు, చిరునామా తదితరాలను పరిశీలించి రికార్డులో నమోదు చేసి అద్దెకు గది ఇవ్వాల్సి ఉంటుంది. అయితే పోలీసుల నిఘా లేకపోవడంతో నిర్వాహకులు పట్టించుకోవడం లేదు. వివరాలు తీసుకోకుండానే జంటలకు అద్దె కిచ్చి సొమ్ము చేసుకుంటున్నారనే విమర్శలున్నాయి. పోలీసులు నిఘా పెట్టి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు.


కసుమూరులో ఇటీవల జంటలు పట్టుబడిన అద్దె గృహం

బీటీఏ దినదర్శిని విడుదల

నెల్లూరు(టౌన్) : స్థానిక మున్సిపల్ ప్రాథమికోన్నత పాఠశాలలో బీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్, వ్యవస్థాపకుడు రమణయ్య చేతుల మీదుగా ఆ సంఘ దినదర్శినిని బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీటీఏ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి మణిసుబ్బు, ప్రసాద్, పల్లం వేణుగోపాల్, మాల్యాద్రి, రఘు, రియాజ్, ఎరుకలయ్య, భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

జొన్నవాడకు బస్సు సౌకర్యం

కావలి: జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన జొన్నవాడ కామాక్షితాయి సన్నిధికి కావలి నుంచి ప్రతి శుక్రవారం ఆర్టీసీ బస్సు సర్వీసును నడుపనున్నట్లు కావలి డిపో మేనేజర్ రాపూరు శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కావలిలో శుక్రవారం సాయంత్రం 6 గంటలకు బస్సు బయలుదేరుతుందని చెప్పారు. అల్లూరు, రాజుపాళెం, బుచ్చిరెడ్డిపాళెం మీదుగా జొన్నవాడకు చేరుకుంటుందని తెలిపారు. భక్తులు అమ్మవారిని దర్శనం చేసుకుని ఆలయ ప్రాంగణంలో నిద్ర చేసిన పిమ్మట ఉదయం 6 గంటలకు జొన్నవాడలో బయలుదేరి కావలికి ఉదయం 8 గంటలకు బస్సు చేరుకుంటుందని వివరించారు. కావలి, అల్లూరు ప్రాంత భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇటీవల ప్రతి శనివారం ఉదయం 9 గంటలకు కొండ బిట్రగుంటకు ప్రారంభించిన బస్సు సర్వీసును ప్రజలు ఆదరించాలని విజ్ఞప్తి చేశారు.

మంచు దుప్పటి

మనుబోలు: పొగమంచు కమ్మేస్తున్న వేళ గ్రామాలు సరికొత్త అందాలను దిద్దుకుంటున్నాయి. బుధవారం ఉదయం మంచు ప్రభావంతో రహదారులపై వాహనాలు, మనుషులు కూడా కనిపించ లేదు. హైవేపై దట్టంగా పొగ మంచు కమ్ముకోవడంతో ఉదయం వేళ వాహనాలు లైట్లు వేసుకుని వెళ్లాల్సి వస్తోంది.


లైట్లు వేసుకుని వెళ్తున్న లారీ


పచ్చటి పొలాలపై..

నూతన సంవత్సరాన్ని స్వాగతిస్తూ..

కోవూరు, సర్వేపల్లి నియోజకవర్గాల్లో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. మంగళవారం రాత్రి నుంచే యువత కేక్‌లు కట్ చేసి సందడి చేశారు. బుధవారం ఆలయాలు కిటకిటలాడాయి.

ముత్తుకూరు: న్యూ ఇయర్ వేడుకలను బుధవారం ప్రజలు ఘనంగా చేసుకున్నారు. ఆలయాలకు భక్తులు పోటెత్తారు. పూజా కార్యక్రమాలు జరిగాయి. ఇళ్ల ముందు మహిళలు రంగవల్లులను తీర్చిదిద్దారు. వివిధ గ్రామాల్లో ఉదయం నుంచే ప్రధాన పార్టీల కార్యకర్తలు, అభిమానులు తమ నాయకులను పుష్పగుచ్ఛాలు, శాలువలతో సత్కరించి అభినందనలు తెలిపారు. కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ తాళ్లపూడిలో వైఎస్సార్‌సీపీ కన్వీనర్ మెట్ట విష్ణువర్ధన్‌రెడ్డి భారీ కేక్ కట్ చేశారు. ఎంపీపీ సుగుణమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు వెంకటరమణయ్య, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

➡ **పొదలకూరు:** న్యూ ఇయర్ సందర్భంగా జనం సంబరాలు చేసుకున్నారు. పట్టణంలోని శ్రీలక్ష్మి గోదా వెంకటేశ్వరాలయం, సాయిబాబా మందిరం, గీతామందిరం, శ్రీవీరాంజనేయస్వామి, శివాలయం, విఘ్నేశ్వరాలయాల్లో పూజలు జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు. అయ్యప్పనగర్‌లోని శ్రీకళ్యాణ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో పూజలు జరిగాయి. ప్రభగిరిపట్నం శ్రీవీర అభయాంజనేయ స్వామి దేవస్థానానికి భక్తులు పోటెత్తారు.

➡ **తోటపల్లిగూడూరు:** కొత్త సంవత్సరాన్ని స్వాగతిస్తూ యువత గ్రామాల్లో సంబరాలు చేసుకున్నారు. కాటేపల్లి శివాలయం, వరిగొండలోని జ్వాలాముఖి ఆలయం, పేడూరులోని చాముండేశ్వరి ఆలయం, కోడూరు వేళాంగణి చర్చి భక్తులతో కిక్కిరిశాయి. కోడూరు బీచ్‌కు సందర్శకుల తాకిడి అధికమైంది.


ముత్తుకూరు : కేక్ కట్ చేసిన విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు

➡ **బుచ్చిరెడ్డిపాళెం:** నూతన సంవత్సరం సందర్భంగా వవ్వేరులోని చర్చిలో బుధవారం పెద్ద ఎత్తున ప్రార్థనలు జరిగాయి. బుచ్చిరెడ్డిపాళెంలోని వెంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పుకుంటూ సందడి చేశారు.

➡ బుచ్చిరెడ్డిపాళెం మండల పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసులుకు ఎంపీడీఓ శ్రీహరి, కార్యాలయ సూపరింటెండెంట్ మంజుల, పీఆర్ ఏఈ గోపిరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలతో పాటు పలువురు సిబ్బంది నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

➡ బుచ్చి నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజకు కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, సిబ్బంది నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాలు అందజేశారు.

➡ **విడవలూరు:** మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో నూతన సంవత్సర వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద స్థానిక మాల మహానాడు కార్యకర్తలు నూతన సంవత్సర వేడుకలను జరిపారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మాల మాహానాడు రాష్ట్ర అధ్యక్షురాలు శేషమ్మ, కార్యకర్తలు జడ్డా జగదీష్, ఎల్లు చరణ్ పాల్గొన్నారు.

➡ **ఇందుకూరుపేట:** ఆంగ్ల సంవత్సరాది వేడుకలను పురస్కరించుకుని గంగపట్నంలోని చాముండేశ్వరి అమ్మవారి దేవస్థానంలో బుధవారం విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి అర్చకులు పూలంగిసేవ గావించారు. భక్తుల రాకతో ఆలయ ప్రాంగణం సందడిగా మారింది. అలాగే మండలంలోని ఇందుకూరుపేట, కొత్తూరు, మైపాడు, కొమరిక, ముదివర్తిపాళెం, పల్లిపాడు, కుడితిపాళెం తదితర గ్రామాల్లోని ఆలయాల్లో, చర్చిల్లో, మసీదుల్లో ప్రత్యేక పూజలు, ప్రార్థనలు జరిపారు.


పొదలకూరు: వెంకటేశ్వరాలయంలో పూజలు


టీపీగూడూరు: చిన్నచెరుకూరులో సంబరాలు


ఇందుకూరుపేట: చాముండేశ్వరి ఆలయంలో..


బుచ్చిరెడ్డిపాళెం: చైర్‌పర్సన్‌కు పుష్పగుచ్ఛం అందజేత


విడవలూరులో..


బుచ్చిరెడ్డిపాళెం: ఎంపీపీకి శుభాకాంక్షలు తెలుపుతున్న అధికారులు



వవ్వేరు చర్చిలో ప్రార్థనలు


కోడూరు బీచ్‌లో సందడి

కమ్మపాళెంలో 'ఫ్యామిలీ డాక్టర్'

కొడవలూరు: మండలంలోని కమ్మపాళెంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి వైద్య పరీక్షలు చేసి మందులు ఇచ్చారు. అనంతరం కొడవలూరు పీహెచ్‌సీ డాక్టర్ గీతా సాహితి మాట్లాడుతూ ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ఇంటి వద్దకే ఉచిత వైద్యసేవలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. గ్రామానికి వైద్యులు వచ్చినప్పుడు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో హెచ్ఎస్ వి.రామ్మోహన్, ఎంఎల్‌హెచ్‌పీ కె.పద్మజ, హెచ్ఏలు టి.రాధమ్మ, సీహెచ్.సుధాకర్, ఆశా కార్యకర్తలు డి.రాజేశ్వరి, ఎస్.కల్పన, బి.శీనమ్మ పాల్గొన్నారు.


కార్యక్రమానికి హాజరైన వైద్య బృందం

4న స్పోర్ట్స్ మీట్

నెల్లూరు(అర్బన్): నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో బ్లాక్‌లెవల్ క్రీడా పోటీలను నిర్వహిస్తున్నామని జిల్లా యువజన అధికారి ఎ.మహేంద్ర రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 4వ తేదీన నెల్లూరు డివిజన్‌కు సంబంధించి నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో బ్లాక్ లెవల్ స్పోర్ట్స్ మీట్ నిర్వహిస్తున్నామన్నారు. అలాగే కందుకూరు డివిజన్‌కు సంబంధించి 6న కందుకూరులోని టీఆర్ఆర్ జూనియర్ అండ్ డిగ్రీ కళాశాల మైదానంలో స్పోర్ట్స్ మీట్ జరుగుతుందన్నారు. పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న జిల్లా యువత ఆయా తేదీల్లో ఉదయం 9 గంటలకు చేరుకుని దరఖాస్తు చేసుకోవాలని కోరారు. 15 నుంచి 29 ఏళ్లలోపు వారు మాత్రమే పోటీల్లో పాల్గొనేందుకు అర్హులన్నారు. యువకుల్లో వాలీబాల్, వంద మీటర్ల పరుగుపందెం, షాట్‌పుట్, మహిళలకు ఖోఖో, వంద మీటర్ల పరుగుపందెం, షాట్‌పుట్ పోటీలు ఉంటాయని, గెలుపొందిన వారికి బహుమతులు అందిస్తామన్నారు. వీరు జిల్లా స్థాయిలో నిర్వహించే పోటీలకు అర్హులవుతారని వివరించారు.